# వడ్డెర సంఘం మండల అధ్యక్షుడిగా ఓర్సు రాజకుమార్




**ఐనవోలు/జులై 22(జర్నలిస్ట్ వార్త):**
ఐనవోలు మండల వడ్డెర సంఘం నూతన అధ్యక్షుడిగా ఓర్సు రాజకుమార్ నియమితులయ్యారు. కుల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఆయన సేవలను గుర్తిస్తూ సంఘం రాష్ట్ర నాయకత్వం ఈ బాధ్యతలను అప్పగించింది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లపు శివకుమార్ ఆయనకు అధికారిక నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజకుమార్



మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి, సహకరించిన మండల సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మండల పరిధిలోని వడ్డెర కులస్థుల సమస్యలను వెలికితీసి, వాటి పరిష్కారానికి శ్రమిస్తానని పేర్కొన్నారు. సంఘ బలోపేతానికి, సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా అహర్నిశలు కృషి చేస్తానని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో సంఘ జాతీయ సలహాదారు పల్లెపు సమ్మయ్య, రాష్ట్ర నాయకుడు కడిపికొండ కుమారస్వామితో పాటు పలువురు మండల ప్రతినిధులు, నాయకులు పాల్గొని రాజకుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# వీరయ్య కుటుంబాని పరామర్శించన అరూరి రమేష్




**వర్ధన్నపేట/జులై 22(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామానికి చెందిన మేకల వీరయ్య ఇటీవల మృతి చెందగా, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ ఆయన కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. వీరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, తనకు ఉన్న సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మార్గం బిక్షపతి, మాజీ సర్పంచ్ ముత్యం సంపత్, దుగ్యాల మాధవరావు, గ్రామ ప్రెజెంట్ ఉపసర్పంచ్ మేకల దేవేందర్, మాజీ ఉపరసర్పంచ్ బిర్రు చంద్రయ్య, సహకార సంఘం డైరెక్టర్ వాసు దేవరావు, వర్ధన్నపేట మున్సిపాలిటీకౌన్సిలర్ కుమారస్వామి, స్థానిక నాయకులు, వెంకన్న , గ్రామ టి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు తాటికాయల సురేష్,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమణకు గురైన సాగునీటి కాలువ..

## చర్యలు తీసుకోవాలని రైతుల వినతి




**వర్ధన్నపేట/జులై 22(జర్నలిస్ట్ వార్త):**
మండలంలోని ఇల్లంద గ్రామ శివారులో ఉన్న ఊర చెరువు సాగునీటి కాలువను కబ్జా చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఇల్లంద గ్రామ రైతులు వర్ధన్నపేట మండల తాసిల్దార్ విజయ్‌సాగర్‌కు వినతిపత్రం సమర్పించారు.
ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఊర చెరువు ఆయకట్టు కింద దాదాపు 8 ఫీట్ల వెడల్పు కలిగిన ప్రధాన సాగునీటి కాలువను కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా ఆక్రమించి కంచె వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువ రూపురేఖలు మారిపోతే ఆయకట్టు పరిధిలోని పంట పొలాలకు సాగునీరు అందక తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన చెందారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ ఆక్రమణల వల్ల వ్యవసాయంపై ఆధారపడిన వందలాది కుటుంబాల జీవనోపాధి దెబ్బతింటుందని పేర్కొన్నారు.
అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి కాలువపై వేసిన కంచెను, అక్రమ నిర్మాణాలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. నీటి పారకం యథావిధిగా కొనసాగేలా చర్యలు తీసుకొని, రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతుల ఆవేదనను ఆలకించిన తాసిల్దార్ విజయ్‌సాగర్ సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, కాలువ ఆక్రమణలపై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇల్లంద గ్రామానికి చెందిన పలువురు రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# రాహుల్ గాంధీ అరెస్టు అప్రజాస్వామ్యం



**వరంగల్/జులై 22(జర్నలిస్ట్ వార్త):** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ బుధవారం వరంగల్ నగరంలోని పోచమ్మమైదాన్ సర్కిల్‌లో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో వారు హాజరైనారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యారంగ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులపై పోలీసుల ద్వారా దాడులు చేయించడం ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడమేనని మండిపడ్డారు. దేశంలో వరుసగా జరుగుతున్న పేపర్ లీకేజీలు, పెరుగుతున్న నిరుద్యోగంపై ప్రధాని మోదీ సమాధానం చెప్పాలన్నారు. అరెస్టు చేసిన రాహుల్ గాంధీని వెంటనే విడుదల చేయాలని, విద్యార్థులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దు సత్యం, ఎస్సీ విభాగం రాష్ట్ర నాయకుడు మన్నే బాబురావు, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాంపల్లి యాదగిరి, నాయకురాలు సింగపురపు అరుణ, కత్రియాల ఆలయ చైర్మన్ శ్రీపాది సతీష్, మాజీ కార్పొరేటర్ ఈదుల విక్టర్, మండల నాయకుడు కర్ర శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భట్టికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఘన స్వాగతం

## ఎన్ఐటీ అతిథి గృహంలో పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కారం

## వరంగల్ అభివృద్ధి కార్యక్రమాలకు విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి



**హసన్‌పర్తి,/ జూలై 22 (జర్నలిస్ట్ వార్త):** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసేందుకు బుధవారం వరంగల్‌కు వచ్చిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఘన స్వాగతం పలికారు. వరంగల్‌లోని ఎన్ఐటీ అతిథి గృహంలో ఉప ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై స్వల్పంగా చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. వరంగల్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మాజీ మేయర్ గుండు సుధారాణితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# మహేష్ కుటుంబానికి భరోసా

## మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పరామర్శ

## నిందితులకు కఠిన శిక్ష తప్పదని స్పష్టం



**హసన్‌పర్తి/ జూలై 22 (జర్నలిస్ట్ వార్త):**
పెట్రోల్ దాడిలో ఇటీవల దారుణంగా మృతిచెందిన కాంగ్రెస్ నాయకుడు, 14వ డివిజన్ మాజీ అధ్యక్షుడు, సోషల్ మీడియా ఇన్‌చార్జి అడప మహేష్ కుటుంబాన్ని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు బుధవారం పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వరంగల్‌లోని ఎన్టీఆర్ నగర్‌లో మహేష్ నివాసానికి చేరుకున్న మంత్రి, ఎమ్మెల్యే ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మహేష్ పార్టీ కోసం చేసిన సేవలను స్మరించుకుంటూ, ఆయన కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఘటనలో ప్రమేయం ఉన్న నిందితులను త్వరితగతిన అరెస్టు చేసి చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్, డివిజన్ ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ పర్యటనలో భట్టికి ఘన స్వాగతం

## టీపీసీసీ ఉపాధ్యక్షుడు నమిండ్ల శ్రీనివాస్ శాలువాతో సత్కారం



**హసన్‌పర్తి,/ జూలై 22 (జర్నలిస్ట్ వార్త):**
వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు బుధవారం వరంగల్‌కు వచ్చిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు టీపీసీసీ ఉపాధ్యక్షుడు నమిండ్ల శ్రీనివాస్ ఘన స్వాగతం పలికారు. వరంగల్‌లోని ఎన్ఐటీ అతిథి గృహంలో ఉప ముఖ్యమంత్రి భట్టిని మర్యాదపూర్వకంగా కలిసిన నమిండ్ల శ్రీనివాస్ శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, వరంగల్ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై సంక్షిప్తంగా చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఉప ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు.

RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక



# మురికి కూపంగా కేశపురం

**మూసుకుపోయిన డ్రైనేజీలు.. రోడ్డెక్కుతున్న వర్షపు నీరు**

**డెంగ్యూ, మలేరియా భయంతో గ్రామస్తుల ఆందోళన -తక్షణమే పూడికతీత చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి**





**తల్లాడ/ జూలై 22 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలంలోని కేశపురం గ్రామంలో డ్రైనేజీలు పూర్తిగా మూసుకుపోవడంతో గ్రామం మురికి కూపంగా మారింది. కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, పిచ్చిమొక్కల కారణంగా వర్షపు నీరు సక్రమంగా వెళ్లక రహదారులపైకి చేరుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం మన ఊరుమన గ్రామం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నప్పటికీ, కేశపురంలో మాత్రం వాటి ఆనవాళ్లు కనిపించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీలు, సైడ్ కాలువలు నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో నీటి ప్రవాహం పూర్తిగా దెబ్బతిందని, స్వల్ప వర్షానికే రోడ్లపై నీరు నిలిచిపోతుందని చెబుతున్నారు.

కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి ఏర్పాటు చేసిన మార్గాలు పూర్తిగా మూసుకుపోయాయని, దుర్వాసనతో ప్రజలు ఇళ్లలోనే ఉండలేని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రతి ఏడాది నిర్వహణకు నిధులు వస్తున్నప్పటికీ డ్రైనేజీల పూడికతీత, శుభ్రత పనులను అధికారులు గాలికొదిలేశారని ఆరోపిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల కారణంగా డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు వంటి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించి చెత్తాచెదారాన్ని తొలగించి, డ్రైనేజీల పూడికతీత పనులు చేపట్టి నీటి ప్రవాహానికి అడ్డంకులను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. మన ఊరు మన గ్రామం అనే నినాదం మాటలకే పరిమితం కాకుండా, గ్రామాన్ని పరిశుభ్రంగా మార్చేలా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కేశపురం ప్రజలు కోరుతున్నారు.

## కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో
# మంత్రి పొన్నం ప్రభాకర్ వరుణయాగం

**సమృద్ధి వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు**







**భీమదేవరపల్లి/జూలై 22 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కొత్తకొండలోని భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక వరుణయాగం, యజ్ఞయాగాలు నిర్వహించారు. స్వామివారికి 108 కలశాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కాకతీయుల కాలం నాటి భద్రకాళి సమేత కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి ఆలయం ఎంతో మహిమాన్వితమైన క్షేత్రమని, ఈ ప్రాంత ప్రజలకు అపారమైన విశ్వాసం ఉన్న దైవమని అన్నారు. రాష్ట్రంలో మంచి వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాలపై శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో, ప్రజల్లో భగవంతునిపై ఉన్న విశ్వాసంతో తెలంగాణ వ్యాప్తంగా అనేక దేవాలయాల్లో వరుణయాగాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా బోనాల పండుగ సందర్భంగా అక్కడి ఆలయాల్లో కూడా అమ్మవారిని దర్శించుకుని రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి వ్యవసాయం అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచ్‌లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో విద్యార్థులపై లాఠీ-చార్జికి నిరసనగా ముల్కనూర్‌లో ధర్నా



**భీమదేవరపల్లి/ జూలై 22 (జర్నలిస్ట్ వార్త):** ఢిల్లీలో నీట్ విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని నిరసిస్తూ భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ అంబేద్కర్ కూడలిలో బుధవారం జేఏసీ, ఎమ్మార్పీఎస్, సీపీఐ, అంబేద్కర్ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనలతో తీవ్ర మనోవేదనకు గురై పలువురు నిరుద్యోగ అభ్యర్థులు ఆత్మహత్యలకు పాల్పడిన విషయం బాధాకరమని పేర్కొన్నారు. పరీక్షల్లో పారదర్శకత కోసం విద్యార్థులు, యువత ప్రజాస్వామ్యబద్ధంగా, అహింసా మార్గంలో చేపడుతున్న ఉద్యమానికి మద్దతుగా ప్రముఖ పర్యావరణవేత్త, విద్యావేత్త, మెగసెసే అవార్డు గ్రహీత సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష చేస్తున్న సమయంలో ఆయనను అరెస్టు చేయడాన్ని ఖండించారు. అలాగే పార్లమెంట్ మార్చ్‌లో పాల్గొన్న విద్యార్థులు, యువత, సీనియర్ సిటిజన్లపై విచక్షణారహితంగా లాఠీచార్జి చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. ఈ సందర్భంగా వారు పలు డిమాండ్లు చేశారు. నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పేపర్ లీకేజీ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున పరిహారం అందించాలని కోరారు. అరెస్టు చేసిన సోనమ్ వాంగ్‌చుక్‌ను వెంటనే విడుదల చేసి, విద్యార్థులపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని, భవిష్యత్తులో పేపర్ లీకేజీలు జరగకుండా సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, లాఠీచార్జిలో గాయపడిన వారికి నష్టపరిహారం అందించాలని కూడా ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో జేఏసీ హుస్నాబాద్ నియోజకవర్గ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి, జేఏసీ భీమదేవరపల్లి మండల చైర్మన్ డ్యాంగల సారయ్య, ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాట్ల వెంకటస్వామి మాదిగ, అంబేద్కర్ సంఘ నాయకులు కండె సుధాకర్, మాడుగుల కొమురయ్య, పెట్టెం కుమారస్వామి, తాళ్లపల్లి ఆశీర్వాదం, ఆర్. భిక్షపతి, పార్నందుల సురేష్, తాళ్లపల్లి జగన్, గాన్ల పద్మ, కొట్టే రేణుక, మైలగాని జయ, గొడుగు వజ్రమ్మ, అంబేద్కర్ సంఘం మండల కన్వీనర్ ఎల్తూరు ప్రేమ్‌రాజ్, సీపీఐ భీమదేవరపల్లి మండల కార్యదర్శి ఆదరి రమేష్, సీపీఐ నాయకులు కుమారస్వామి, కిరణ్, రవి, జేఏసీ నాయకులు చంద్రమౌళి, రోడ్డ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీ ఉద్యోగులకు భద్రత ఎప్పుడూ..?

**15 ఏళ్లుగా సేవలందిస్తున్న సిబ్బందిని క్రమబద్ధీకరించాలని టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్**



**హసన్‌పర్తి/ జూలై 22 (జర్నలిస్ట్ వార్త):** కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు యూఆర్ఎస్, సమగ్ర శిక్ష ఎస్ ఎస్ ఏ పరిధిలో సుమారు 15 ఏళ్లుగా సేవలందిస్తున్న బోధన, బోధనేతర సిబ్బందిని తక్షణమే క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు దూపటి కిరణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హసన్‌పర్తి మండలం భీమారం కేజీబీవీలో బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో మండల శాఖ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల శాఖ అధ్యక్షురాలు నేదునూరి రమాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం "సమాన పనికి సమాన వేతనం" సూత్రాన్ని అమలు చేసి కాంట్రాక్టు సిబ్బందికి న్యాయం చేయాలని కోరారు. ప్రత్యేక అధికారిణి స్వప్న మాట్లాడుతూ రెగ్యులర్ ఉద్యోగులకు వర్తించే అన్ని రకాల సెలవులను కేజీబీవీ సిబ్బందికీ వర్తింపజేయాలని, వార్షిక ప్రోత్సాహకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షురాలు రమాదేవి ఉద్యోగులకు ఆరోగ్య కార్డులు అందించాలని కోరగా, ప్రధాన కార్యదర్శి నరేష్ కేర్‌టేకర్లను నియమించి మహిళా సిబ్బందికి రాత్రి విధుల నుంచి మినహాయింపు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నాయకుడు అనిల్ మాట్లాడుతూ 29 రోజుల సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు యాకయ్య, కోశాధికారి నాగరాజు, రాజ్‌కుమార్, జ్యోతి, మమత, సుధారాణి, అరుణ, స్వర్ణ, రజిత, రాజేశ్వరి, హెలెన్ జోలీ, మౌనిక, సులోచన, అంబిక, ప్రియాంక, అర్చన, శ్రీలతతో పాటు పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## భీమదేవరపల్లిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**భీమదేవరపల్లి/జూలై 22 (జర్నలిస్ట్ వార్త):** భీమదేవరపల్లి మండల కేంద్రంలో బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమం మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో ఈ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా పోలు సదానందంకు రూ.60,000, మాచర్ల రజనీకాంత్‌కు రూ.60,000, మార్పాటి లక్ష్మికి రూ.60,000, పోలు కొమురయ్యకు రూ.38,000, వేముల మల్లయ్యకు రూ.33,000 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ బీసీ సెల్ నాయకుడు డబ్బా శంకర్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు మాచర్ల సదానందం, వార్డు సభ్యుడు చాగంటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పచ్చునూరి కరుణాకర్, పోలు కొమురయ్య, పిట్టల మొగిలి, కొదురుపాక బన్నీ తదితరులు పాల్గొన్నారు.

# వేలేరుకు వరాల జల్లు

**రూ.2 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం.. మరో రూ.2 కోట్ల హామీ**

**రెండో విడతలో 50 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం: ఎమ్మెల్యే కడియం శ్రీహరి**





**వేలేరు,/ జూలై 22 (జర్నలిస్ట్ వార్త):** వేలేరు మేజర్ గ్రామపంచాయతీకి అభివృద్ధి వరాలు కురిపించారు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి. ఇప్పటికే మంజూరైన రూ.2 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు బుధవారం శ్రీకారం చుట్టిన ఆయన.. గ్రామానికి మరో రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయడంతో పాటు రెండో విడతలో 50 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ప్రకటించారు. వేలేరు సర్పంచ్ బిల్లా యాదగిరి ఆధ్వర్యంలో దాదాపు రెండు వేల మంది గ్రామస్తులతో నిర్వహించిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధిలో ఎక్కడా రాజీ పడబోమన్నారు. పెండింగ్‌లో ఉన్న రెండు వీవో భవనాలు, మండల సమాఖ్య భవనం, ప్రభుత్వ పాఠశాల డైనింగ్ హాల్ నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులు నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని నిధులు తీసుకువచ్చి వేలేరును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. సభకు సర్పంచ్ బిల్లా యాదగిరి అధ్యక్షత వహించగా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, హౌసింగ్ పీడీ, తహసీల్దార్, ఎంపీడీవో, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ శాఖల అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులపై లాఠీ-చార్జీ దారుణం

**రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ**

**మోదీ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ యువనేత కట్కూరి గౌతమ్ డిమాండ్**



**ఎల్కతుర్తి,/ జూలై 22 (జర్నలిస్ట్ వార్త):** విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల కోసం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టిన నిరసనపై పోలీసులు లాఠీచార్జీ చేయడం, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య విలువలను కాలరాయడమేనని కాంగ్రెస్ యువనేత కట్కూరి గౌతమ్ ఆరోపించారు. బుధవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ, నీట్ పరీక్ష పేపర్ లీక్ వంటి అంశాలతో దేశ విద్యా వ్యవస్థపై విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొన్న నేపథ్యంలో వారు శాంతియుతంగా తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారని అన్నారు. అలాంటి విద్యార్థులపై విచక్షణారహితంగా లాఠీలు ప్రయోగించడం, వారిని చెదరగొట్టడం అప్రజాస్వామిక చర్య అని విమర్శించారు. విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలపై కూడా పోలీసులు వ్యవహరించిన తీరు ఖండనీయమన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును అణచివేయడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నైతిక బాధ్యత వహిస్తూ విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కట్కూరి గౌతమ్ డిమాండ్ చేశారు.

# పాఠశాలల నిధుల వినియోగంపై ఆడిట్ ముమ్మరం

**నాలుగు మండలాల్లో రికార్డుల పరిశీలన**

**పారదర్శకంగా నిర్వహించాలని డీఈఓ సదానందం సూచన**



**తల్లాడ/ జూలై 22 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో 202526 విద్యా సంవత్సరానికి సంబంధించిన వివిధ గ్రాంట్ల వినియోగంపై జిల్లా వ్యాప్తంగా ఆడిట్ ప్రక్రియ వేగం పుంజుకుంది. సమగ్ర శిక్ష హైదరాబాద్ కార్యాలయం నియమించిన ప్రత్యేక ఆడిట్ బృందాలు బుధవారం వైరా, తల్లాడ, కల్లూరు, ఏన్కూరు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించాయి. జిల్లా విద్యాశాఖ అధికారి సదానందం పర్యవేక్షణలో సాగిన ఆడిట్‌లో పాఠశాలలకు విడుదలైన వివిధ నిధుల వినియోగం, నగదు పుస్తకాలు, వోచర్లు, సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లా సమగ్ర శిక్ష అకౌంట్స్ విభాగం ఆడిట్ ప్రక్రియను సమన్వయం చేసింది. ఆడిట్ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పాఠశాలల్లో నోటీస్ బోర్డులు ఏర్పాటు చేసి వివరాలను ప్రదర్శించారు. ఆడిట్ సందర్భంగా ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా విద్యాశాఖ అధికారి సదానందం సంతృప్తి వ్యక్తం చేశారు. నిధుల వినియోగంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచించారు.